సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. అనంతరం అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి పేర్కొన్నారు. అడ్మిషన్స్‌కు సంబంధించి ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16 నుంచి 22 లోగా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ లెవెల్‌లో బీస్సీ ఆనర్స్ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఆనర్స్ ఫిజిక్స్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ, బీఎస్సీ ఆనర్స్ బోటనీ, బీఎస్సీ ఆనర్స్ జువాలజీ, బీఎస్సీ ఆనర్స్ మైక్రోబయాలజీ, బీఏ ఆనర్స్ హిస్టరీ, బీఏ ఆనర్స్ ఎకనామిక్స్, బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బీ.కాం జనరల్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ హోటల్ మేనేజ్‌మెంట్, బీబీఏ హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు 12 పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ సోషల్ వర్క్, ఎం.కాం, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, మైక్రోబయాలజీ, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. వివరాలకు 7032270810, 9052297729, 9396235303 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉత్తరాంధ్ర ప్రజా సమస్యలపై పోరాటం


మాట్లాడుతున్న కర్రి ఆదిబాబు

సీతంపేట: ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలతో కూడిన ఉత్తరాంధ్ర రాష్ట్రాన్ని 2025 నాటికి సాధించడమే తమ లక్ష్యమని ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ అధ్యక్షుడు కర్రి ఆదిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట రామారావు తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 76 ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఉత్తరాంధ్రలో నీరు, నిధులు, నియామకాలు లేక పోవడం వల్ల ప్రజలు వలసలు పోతున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌కు కూటి కోసం వెళ్లిన 26 బీసీ కులాలను, రిజర్వేషన్లు వెనుకబడిన తరగతుల సంఘం సిఫార్సులు లేకుండా కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం 2014లో తొలగించిందన్నారు. తమ పార్టీ ఉత్తరాంధ్ర ప్రజలు ఎక్కడున్నా వారి సమస్యలపై పోరాడుతుందని పేర్కొన్నారు.

25వ వార్డులో మెగా ఫాగింగ్


సీతంపేటలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: దోమల నియంత్రణకు జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 25వ వార్డులో మెగా ఫాగింగ్ నిర్వహించారు. దుర్గాగణపతి ఆలయం, రాధాకృష్ణాలయం, సీతంపేట, గొల్లవీధి, గణేష్‌నగర్, కనకమ్మ వీధి, రెల్లి వీధి, రాజేంద్రనగర్, మధురానగర్ ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టారు. మలేరియా సిబ్బంది రాంబాబు, శివ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో వారం రోజులకు మించి నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. లేకుంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలిగించే దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

సూపర్‌గా స్నీపర్ పార్కు

- సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో రూ.2.5 కోట్లతో నిర్మాణం
- నగరానికి మరింత వన్నె తెచ్చేలా రూపకల్పన
- నేడు వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం



సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో స్నీపర్ పార్క్ ప్రవేశ ద్వారం


పార్కులో అందమైన వాతావరణం, పెవిలియన్


వాకింగ్ ట్రాక్

సీతమ్మధార: అందాల విశాఖ నగరానికి మరింత వన్నె తెచ్చేలా జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో స్నీపర్ పార్క్ రూపుదిద్దుకుని ప్రారంభానికి సిద్ధమైంది. ప్రశాంత, ఆహ్లాదకర వాతావరణంలో ఈ ఉద్యానవనాన్ని అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దారు. జీవీఎంసీ జనరల్ ఫండ్స్ రూ.2.5 కోట్లతో నగరంలో ప్రత్యేకం స్థానం పొందేలా ఈ పార్కు నిర్మించారు. ప్రజలు సేదతీరేలా అన్ని సదుపాయాలతో సిద్ధం చేశారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఆదివారం ఉదయం 8.45 గంటలకు స్నీపర్ పార్క్‌ను ప్రారంభించనున్నారు.

ఉద్యానవన విశేషాలు..

సందర్శకులను మైమరిపించేలా స్నీపర్ పార్కును సూపర్‌గా రూపొందించారు. నాలుగు వాకింగ్ ట్రాక్‌లు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లల ఆట స్థలం, వర్షం ఆశ్రయాలు, నాలుగు పెర్గోలా, లిల్లీపాండ్, పెవిలియన్, టాయిలెట్లు, గెజిబో, ధ్యాన, యోగా శాలలు, యాంఫీ థియేటర్, నీటి సరఫరా, బిందు సేద్యం వ్యవస్థ మొదలగునవి పార్కులో ఉన్నాయి. ఇసుకతో వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లల కోసం ఆట పరికరాలు, పెద్దల కోసం జిమ్ ఏర్పాటు చేశారు. అత్యాధునిక సదుపాయాలతో స్నీపర్ పార్క్ అందుబాటులోకి రానుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ అందుబాటులో..



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో అన్ని సౌకర్యాలతో నివాసులకు అందుబాటులోకి స్నీపర్ పార్కు తీసుకొచ్చాం, పిల్లలు, పెద్దలు, మహిళలు, వృద్ధులకు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయవచ్చు. ఆహ్లాదకర వాతావరణంలో పార్కు సిద్ధం చేశాం.

– కె.అనిల్‌కుమార్‌రాజు, కార్పొరేటర్, 14వ వార్డు

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం


పార్వతీశ్వరాలయంలో ముస్తాబైన పార్వతీదేవి


నందగిరినగర్‌లో ఏర్పాటు చేసిన మండపం

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు
- ముస్తాబైన ఆలయాలు, మండపాలు

సీతంపేట: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు వాడవాడలా ఏర్పాట్లు చేశారు. సీతంపేట, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో ప్రధాన రహదారులు, కాలనీల్లో చూడముచ్చటగా మండపాలు వేశారు. ఆదివారం నుంచి ఈ నెల 24 వరకు అంగరంగ వైభవంగా దసరా వేడుకలు జరగనున్నాయి. ప్రతి రోజూ విశేష పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితాపీఠం, సీతంపేటలోని పార్వతీశ్వరాలయం, కనకమ్మ ఆలయాల్లో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయి. యూత్ అసోసియేషన్లు, కాలనీలు, వీధుల్లో మండపాలు నిర్మించి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుతుంటారు. ఆటో, లారీ, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్లు, కార్మిక సంఘాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లోని ఉద్యోగులు దుర్గా నవరాత్రులు పెద్ద ఎత్తున జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

లలితా పీఠంలో...

లలితా పీఠం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో ఆదివారం ఉదయం కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అమ్మవారు రోజుకొక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన, పంచామృతాభిషేకం, చండీపారాయణ, గోపూజ, గర్భాలయంలో శ్రీచక్ర నవావరణ, సాయంత్రం చండీ హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు విశేష హోమాలు జరుగుతాయన్నారు. తొలి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు.

పార్వతీశ్వరాలయంలో..

స్థానిక పార్వతీశ్వరాలయంలో పార్వతీ దేవి తొమ్మిది రోజుల పాటు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ తెలిపారు. ప్రతి రోజూ ఉదయం లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన, అవతార అర్చన, శ్రీచక్ర మేరువులకు భక్తులచే కుంకుమ పూజలు, సాయంత్రం లలితా పారాయణ జరుగుతాయని చెప్పారు. ఆదివారం మహాలక్ష్మి అలంకరణలో పార్వతీదేవి దర్శనమిస్తారన్నారు.


లలితా పీఠంలో సిద్ధం చేసిన హోమ గుండం

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: చక్రధర్‌పూర్ డివిజన్, రూర్కెలా స్టేషన్ పరిధిలో జరుగుతున్న భద్రత పనుల నిమిత్తం సోమవారం(ఈ నెల 16వ తేదీ) జగదల్‌పూర్–రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్–రూర్కెలా(18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

ప్రయోగాత్మక హాల్ట్

ప్రయాణికుల సౌకర్యార్థం రూర్కెలా–జగదల్‌పూర్–రూర్కెలా(18107/18108) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16వ తేదీ నుంచి బ్రమా స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

నేడు బెంగళూరు–హతియా వన్ వే స్పెషల్

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు–హతియా(06503) వన్ వే స్పెషల్‌ను నడుపుతున్నారు. ఈ రైలు బెంగళూరులో ఆదివారం ఉదయం 8.50 గంటలకు బయల్దేరి అదే రోజు అర్ధరాత్రి 2.35 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 2.40 గంటలకు బయల్దేరి సోమవారం సాయంత్రం 5.45 గంటలకు హతియా చేరుకుంటుంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధి ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మాధవధార ఈస్ట్ పార్కు వద్ద ఆదివారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరగనుంది. మాధవధార మహిళా వాకర్స్ క్లబ్, ఈస్ట్ పార్కు సంయుక్త ఆధ్వర్యంలో కేర్ ఆస్పత్రి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, ఈస్ట్ పార్కు అధ్యక్షుడు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, సుగర్, ఈసీజీ, ఈఎన్‌టీ, ఎముకల సాంద్రత పరీక్షలు ఉచితంగా చేస్తామని, మాధవధార పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఘనంగా హిందీ పక్షోత్సవాలు

సింధియా: తూర్పు నావికాదళ సాముద్రిక ఆడిటోరియంలో శనివారం హిందీ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నావికా హెడ్ క్వార్టర్స్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్(ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ మనీష్‌శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని వార్షిక హిందీ మ్యాగజైన్ పూర్విప్రాణి 29వ ఎడిషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో పూర్విప్రాణి మ్యాగజైన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం హిందీలో అధికారిక కార్యక్రమాలను నిర్వహించడంలో విశేష కృషి చేసిన వివిధ యూనిట్లకు రాజభాషా పురస్కారాలు అందజేశారు.

భూలోకమాతకు నేడు స్వర్ణకవచ అలంకరణ


భూలోకమాత అమ్మవారు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో రేసపువానిపాలెంలో ఆదివారం నుంచి భూలోకమాత శరన్నవరాత్రి పూజా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి రోజు అమ్మవారు స్వర్ణకవచ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. ఆదివారం ఉదయం 4.30 గంటలకు జలాభిషేకం, 5.30 గంటలకు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, 6.30 గంటలకు నవ దుర్గా హోమం, 7.30 గంటలకు అమ్మవారి దివ్య అలంకరణ, దర్శనాలు ఉంటాయన్నారు. 22న దుర్గాదేవి అవతారం రోజున సాయంత్రం 6 గంటల నుంచి కుంకుమ పూజ జరుగుతుందని చెప్పారు. 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు తిరువీధి ఉంటుందన్నారు.

దేవీ శరన్నవరాత్రుల కరపత్రం ఆవిష్కరణ


ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

కంచరపాలెం: స్థానిక దుర్గానగర్ దుర్గాదేవి, ధనలక్ష్మీదేవి ఆలయాలలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయాల ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, శ్యామాచార్యులు తెలిపారు. ఈ మేరకు ధనలక్ష్మి దేవి ఆలయంలో శ్రీరామ సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల కరపత్రాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. 15వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 24వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో అమ్మవారిని ప్రత్యేక అవతారాల్లో అలంకరించనున్నట్లు తెలిపారు. లక్ష కుంకుమార్చన, చండీ హోమం, సహస్ర దీపారాధన, సరస్వతి పూజ నిర్వహిస్తామన్నారు. ఈ నెల 30న సోమవారం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పల్లా వెంకట్రావు, పల్లా పెంటరావు, నమ్మి భాస్కరరావు, కొయ్య జగదీష్, నమ్మి జ్యోతేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సామాన్యుల రుణాలు మాఫీ చేయాలి


మాట్లాడుతున్న ఫర్హాద్ మాలిక్

తాటిచెట్లపాలెం: కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలను రుణమాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశంలోని సాధారణ పౌరుల రుణాలను సైతం మాఫీ చేయాలని కర్జా ముక్తి అభియాన్(కేఎంఎ) జాతీయ కార్యదర్శి ఫర్హాద్ మాలిక్ భర్తియా డిమాండ్ చేశారు. రైల్వే న్యూకాలనీ సింకా హోటల్‌లో కేఎంఎ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాన్యులు తమ కుటుంబాల జీవనోపాధి కోసం, చిన్న చిన్న మొత్తాలను బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు తీసుకుని వ్యాపారాలు చేస్తుంటారని, అవి సరిగా జరగలేని పరిస్థితుల్లో వాయిదాల చెల్లింపుల్లో ఆలస్యమవుతుంటుందన్నారు. అటువంటి వారిని బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు వేధిస్తుంటాయని, దేశంలో పది లక్షల మంది బాధితులు ఉన్నట్లు తమ సంస్థ గుర్తించిందని తెలిపారు. ఇటువంటి వారి రుణాలను కూడా కేంద్రం మాఫీ చేయాలని పోరాడుతున్నట్లు చెప్పారు. ఈ విషయమై త్వరలో సుప్రీం కోర్టుకు వెళ్లనున్నామన్నారు. బాధితులు తమ సంస్థను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్జా ముక్తి అభియాన్ ప్రతినిధులు డాక్టర్ గౌతం పాండే, షేక్ అబ్దుల్ మునీర్, హైదర్ అలీ సింకా, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రం సుభిక్షం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా గెలిపించుకుందాం
- పార్టీలకతీతంగా పథకాల పంపిణీ
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి


వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి 2024 ఎన్నికల్లో మళ్లీ ఆయననే సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అధ్యక్షతన శనివారం అక్కయ్యపాలెం షాదీఖానాలో జేసీఎస్ మండలం–3 పరిధిలోని 45, 46, 47, 55 వార్డులకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహిాంచారు. ముఖ్య అతిథిగా ఆయన జ్యోతి ప్రజల్వనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి వార్డు స్థాయి వరకు ఎటువంటి అవినీతి లేకుండా పార్టీలకు అతీతంగా ప్రజలకు సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హులందరికీ వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, గృహసారథుల ద్వారా పథకాలు అందుతున్నాయని చెప్పారు. ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్య, వైద్యం అందేలా సీఎం చర్యలు తీసుకున్నారన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అరెస్ట్ అయిన క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై బురద జల్లడం తగదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు. జనవరి 1 నుంచి రూ.3 వేలు పింఛన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో యువతను ప్రోత్సహించేందుకు క్రీడలపై(ఆడుదాం, ఆంధ్రా పేరుతో) సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో 1.15 కోట్ల మంది కుటుంబాలకు సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పథకంలో దోచుకున్నారని ఆరోపించారు. ఉత్తర నియోజకవర్గ సమీక్షలో జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు దిశానిర్దేశం చేశారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు.

అద్భుతంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం

సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర నియోజకవర్గంలో నాలుగేళ్లుగా కనిపించని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు.. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అద్భుతంగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామారావు, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, కె.వి.ఎన్.శశికళ, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, వి.ప్రసాద్, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, సీనియర్ నాయకులు ఫారూఖీ, కాశీవిశ్వనాథ్, పేడాడ రమణికుమారి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, జేసీఎస్ మండల కన్వీనర్ నీలి రవి, వార్డు అధ్యక్షులు పైడి రమణ, రత్నాకర్, వెంకటేష్, శైలేష్, ఎం.సునీల్‌కుమార్, మువ్వల సంతోష్, జీలకర్ర నాగేంద్ర, ఈశ్వరి, సీనియర్ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కె.కె.రాజు, బర్కత్ అలీ

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్‌లో కేకేఆర్ ఈశ్వర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత శిక్షణ శిబిరాన్ని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అసోసియేషన్ ఫౌండర్, చైర్మన్, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ సదరం జ్ఞానేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఇటువంటి శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి మహిళలను ప్రోత్సహిస్తున్న అసోసియేషన్‌ను కె.కె.రాజు అభినందించారు. కార్పొరేటర్ బర్కత్ అలీ మాట్లాడుతూ తన వార్డులో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం ద్వారా అనేక మంది మహిళలు కోర్సులు నేర్చుకుని తద్వారా ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భరతనాట్యం, కోలాటం, టైలరింగ్, బ్యూటీషియన్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తామని, సంబంధిత టీచర్లు కోర్సులు నేర్పించడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని నిర్వాహకుడు జ్ఞానేష్ తెలిపారు. భవిష్యత్తులో ఉత్తర నియోజకవర్గం అంతటా ఈ శిక్షణ శిబిరాలను విస్తరిస్తామన్నారు. మహిళలకు మొదటి ప్రాధాన్యమిస్తూ అసోసియేషన్ అధ్యక్షురాలిగా పెద్దాడ జ్యోత్స్న, సెక్రటరీగా కాళ్ల ప్రియాంకను నియమించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, మండల ఇన్‌చార్జ్‌లు పైడి కృష్ణారావు మాస్టారు, అమర్‌రెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

స్వేచ్ఛా, సమానత్వాలకు ప్రతీక బౌద్ధం


మాట్లాడుతున్న బౌద్ధ సాహిత్య రచయిత బొర్రా గోవర్ధన్


హాజరైన సొసైటీల ప్రతినిధులు, సభ్యులు

సీతంపేట: స్వేచ్ఛా, సమానత్వాలకు ప్రతీకగా బౌద్ధ ధమ్మం విరాజిల్లుతోందని బౌద్ధ సాహిత్య రచయిత బొర్రా గోవర్ధన్ అన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల వద్ద గల అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, బౌద్ధ సంఘాల సమాఖ్య సంయుక్త నిర్వహణలో శనివారం 67వ ధమ్మచక్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా బుద్ధుడు, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా 23 మంది బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించారు. ముఖ్య అతిథి గోవర్ధన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అనేక మతాలు దేవుడి ఆధారంగా ఉన్నాయని, ఒక్క బౌద్ధ ధర్మంలో మాత్రమే సమానత, మానవీయతలు ఆధారంగా ఉందని పేర్కొన్నారు. భారతదేశంలో అన్ని రకాల అసమానతలు, కుల వ్యవస్థను వ్యతిరేకిస్తున్న ఏకైక మతం బౌద్ధమని తెలిపారు. అందుకే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నాగపూర్‌లో 5 లక్షల మందితో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి చరిత్ర సృష్టించారన్నారు. ప్రొఫెసర్ పి.డి.సత్యపాల్ మాట్లాడుతూ దక్షిణ కళింగ ప్రాంతంలో భాగమైన విశాఖపట్నం తీరంలో 15 కిలోమీటర్ల పరిధిలో తొట్లకొండ, బావికొండ, బొజ్జన్న కొండ, పావురాల కొండ లాంటి అనేక బౌద్ధారామాలు ఉన్నాయని చెప్పారు. బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మాటూరు శ్రీనివాస్ మాట్లాడుతూ బౌద్ధంలో మాత్రమే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ అంబేడ్కర్ బౌద్ధధర్మం స్వీకరణకు స్ఫూర్తిగా ప్రతి ఏటా ధమ్మచక్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా కళింగ బౌద్ధ పరిషత్ పూజ్యబంతే మొత్తానంద ఆధ్వర్యంలో ధమ్మపతాక ఆవిష్కరణ, ధమ్మ దీక్ష, ధమ్మ ప్రవచనం చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఇంటి గురుమూర్తి, బుద్ధిస్ట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎం.మల్లయ్యరాజు, రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, రత్నకుమారి, సొసైటీ కోశాధికారి గార సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com